క్లుప్తంగా

వైభవంగా రాజగోపుర ప్రతిష్ట



కలశాలతో అర్చకులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో రెండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు క్రిష్ణప్రసాద్‌భట్టార్, రమేష్, క్రిష్ణంరాజు, ధనుష్ సంప్రదాయబద్ధంగా నియమనిష్టలతో ఉదయం ద్వారతోరణ, ధ్వజ కుంభ, ఆరాధన, చతుస్థార్చన, సాయంత్రం చతుర్చాన, జలదివసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న సూర్యకుమారి

పీలేరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి అన్నారు. గురువారం స్థానిక యల్లమంద క్రాస్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో లక్ష్మీపతి, పీడీ రమాదేవి, సీడీపీవో రాజమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్.కమతంపల్లె గ్రామస్తులు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ ఎన్.కమతంపల్లె ప్రాథమిక పాఠశాలను చెంబకూరు జెడ్పీ హైస్కూల్‌కు విలీనం చేయకూడదని నిరసిస్తూ గురువారం గ్రామస్తులు స్థానిక ఎంఈఓ, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ఎంపీడీఓ భానుప్రసాద్, ఎంఈఓ హేమలతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 46మంది విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వం పాఠశాలను విలీనం చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎంఈఓ ప్రభుత్వం ఇంకా పునరాలోచనలో ఉందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. దీంతో ఆందోళన విరమించారు.

ఎంఈఓకు సత్కారం

బి.కొత్తకోట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఎంఈఓ ఆర్.రెడ్డిశేఖర్‌ను గురువారం మండలానికి చెందిన ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సత్కరించాయి. గణతంత్ర దినోత్సవం రోజు ఉత్తమ ఎంఈఓగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఆయన సేవలను గుర్తిస్తూ ఎమ్మార్సీలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రెడ్డిశేఖర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎంఈఓ–2 భీమేశ్వరాచారీ, సంఘాల ప్రతినిధులు కొనియాడారు.

హౌసింగ్ కాలనీల పరిశీలన



హౌసింగ్ స్థలాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలోని ఏపీఐఐసీ లేఅవుట్–2, 3, కంకర్ ఫ్యాక్టరీ లేఅవుట్‌లలో హౌసింగ్‌లో ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ఇందులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మూడు టీములను ఏర్పాటు చేసి మూడు లేఅవుట్లను పరిశీలించారు. ప్రతి లేఅవుట్‌లో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగాయో, ఎన్ని ఖాళీలున్నాయో, ఎన్నిక ఆక్రమణలకు గురయ్యాయో మూడు రోజుల పాటు పరిశీలించిన అనంతరం నివేదిక తహసీల్దార్‌కు అందజేయనున్నారు. డీటీలు రెడ్డెప్పరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె : సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్‌లో ఉచిత వైద్య ఆరోగ్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండపల్లె వెంకటరమణ తెలిపారు. గురువారం సీటీఎం క్రాస్‌రోడ్‌లో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

చిచ్చర పిడుగులు.. క్రికెట్‌లో వీరులు

- బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణింపు
- రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక
- ప్రశంసలు అందుకుంటున్న క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ జట్టు (ఫైల్)

మదనపల్లె సిటీ: వ్యక్తిగత క్రీడల్లో రాణించడం.. ఉన్నతస్థాయికి చేరుకోవడం వారి స్వీయ శిక్షణ, సాధనపై ఆధారపడి ఉంటుంది. కానీ గ్రూపుగా తలబడే క్రీడలో చోటు దక్కించుకోవడం అంత సులువేం కాదు. నిత్యం కసరత్తు చేయాలి. తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలి. మెరుగైన ప్రదర్శనతో సెలక్టర్లను ఆకట్టుకోవాలి. ముఖ్యంగా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడమంటే ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. అలాంటి ఈ ఆటలో మదనపల్లె క్రికెట్ అకాడమీకి చెందిన చిన్నారులు సత్తాచాటుతూ ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికైన పి.హితేష్‌సాయి, జి. తేజేష్ , సారిక్ అక్తర్ రాష్ట్ర స్థాయిలో తలబడేందుకు సిద్ధమవుతున్నారు.

బౌలింగ్‌లో దిట్ట

చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టపడే హితేష్‌సాయి క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. దీంతో కోచ్‌లు జనార్దన్, శ్రీధర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. హితేష్‌సాయి లెఫ్టఆర్మ్ ఫాస్టు బౌలర్‌గా రాణిస్తున్నారు. గాలివీడు మండలం కొర్లగుంటకు చెందిన శ్రీనివాసులు, రెడ్డి నీల కుమారుడు హితేష్‌సాయి మదనపల్లెలో ఓ పాఠశాలలో చదువుతున్నాడు. అంతర్ జిల్లా పోటీల్లో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఇటీవల అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు.

స్పిన్ మాంత్రికుడు తేజేష్

క్రికెట్ క్రీడ అంటే ఆసక్తితో ఆ ఆటలో రాణిస్తున్నాడు తేజేష్. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన జీ.శ్రీనివాసులు, జి.అర్చనల కుమారుడు తేజేష్ తన బౌలింగ్‌తో బ్యాట్‌మెన్స్‌ను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పోటీల్లో అత్యుత్తు ప్రతిభ కనబరిచాడు. అండర్–14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు.

బ్యాటింగ్‌లో ధనాధన్.. షారీక్ అక్తర్

క్రీడల్లో మంచి పేరుతెచ్చుకోవాలన్న ఆశయంతో క్రికెట్‌రంగంలో బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు సారీక్ అక్తర్. మదనపల్లె పట్టణం క్రిష్ణానగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌బాషా, సమీరాఖన్నమ్ కుమారుడు షారీక్ అక్తర్. క్రికెట్ కోచ్‌ల వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. ఓపెనర్‌గా వచ్చిరావడంతోనే తన శైలిలో దంచికొట్టడం అక్తర్ సొంతం. బౌలర్ ఎవరైనా, బంతి ఎంత వేగంతో వచ్చినా స్టాండ్స్‌లోకి పంపడమే అతనికి తెలుసు. కర్నూలు, గుంటూరు జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో సత్తా చాటి తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.



హితేష్‌సాయి అక్తర్, తేజేష్

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డీఎస్పీ కొండయ్యనాయుడు అన్నారు. గురువారం రోడ్డు మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై మహిళా కానిస్టేబుల్‌లు మహిళలతో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీహైస్కూల్ వద్ద డీఎస్పీ కొండయ్యనాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, సీటీఎం రోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, మల్లికార్జున సర్కిల్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తప్పనిసరిగా వాహనంలో ఉంచుకోవాలన్నారు. రోడ్డుప్రమాదం కుటుంబాలను రోడ్డుపై పడేస్తుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ కృష్ణయ్య, వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ, ఎస్‌ఐలు రహీముల్లా, చంద్రమోహన్, ట్రాఫిక్ ఎస్ఐ శివకామిని, గాయత్రి పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో రైతులకు మేలు



కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

నిమ్మనపల్లె : పాడి పరిశ్రమ అభివృద్ధితో రైతులకు మేలు చేకూరుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. గురువారం ముష్టూరు, కొండయ్యగారిపల్లెలో స్థానిక పశుసంవర్ధక శాఖ సహాయకులతో కలిసి పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరం ద్వారా పశువుల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా నట్టల నివారణ మందులను వేసుకోవాలన్నారు. అధిక పాల దిగుబడికి పచ్చి గడ్డితో పాటు, పోషకాలు కలిగిన దాణాను పశువులకు అందించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై కనీస జాగ్రత్తలు తీసుకుంటే, విలువైన పశువులను అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చున్నారు. పశువుల పెంపకంపై సూచనలిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పశు ఆరోగ్య శిబిరం ద్వారా పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు ముందస్తు నట్ట నివారణ మందులు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు మునీంద్ర, హరి, శిరీష, పాడి రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తాం



డి.హర్షవర్ధన్‌రెడ్డి



పోతబోలు నాగరాజ



జన్నే రాజేంద్రనాయుడు



కె.రెడ్డిశేఖర్‌రెడ్డి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తాం ఆ పార్టీ నియోజకవర్గం యువజన విభాగం డి.హర్షవర్ధన్‌రెడ్డి, మహిళా విభాగం టి.మేరి, రైతువిభాగం జన్నే రాజేంద్రనాయుడు ప్రకటించారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. పార్టీకి తాము చేస్తున్న సేవలను గుర్తించి, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో గ్రీవెన్స్‌సెల్ పి.నాగరాజ, ఐటీ వింగ్ ఓ.అరవింద్ తిలక్, ఎస్టీ సెల్ పి.ఈశ్వర్‌నాయక్, వాణిజ్యవిభాగం అధ్యక్షుడు నూర్ మొహియుద్దీన్‌ఖాన్, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు కే.రెడ్డిశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రామసముద్రం : జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, అన్నమయ్యజిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడిగా, జిల్లా యాక్టివిటీ సభ్యుడిగా నందకిశోర్‌రెడ్డిలు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాయచోటి పార్టీ కార్యాలయంలో అన్నమయ్యజిల్లా రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

పెద్దతిప్పసముద్రం: రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు అన్నారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారితో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మండలంలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉంది, ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయంపై చర్చించారు. గ్రామ పంచాయతి, మండల గ్రాంట్‌లోని నిధుల్లో అధిక శాతం తాగునీటి నివారణకే వెచ్చించేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలంలో ప్రధాన సమస్యలు, పంచాయతి కార్యదర్శుల కొరత, పని తీరు విధానంపై ఆరా తీశారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

లయన్స్‌క్లబ్ భవనానికి రూ. లక్ష విరాళం

పీలేరు : పీలేరు లయన్స్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థానిక వెంకటేశ్వర జువెలర్స్ అధినేత వెంకటేష్, నాగమణి దంపతులు, వారి కుమారుడు నాని రూ. లక్ష విరాళం అందజేశారు. గురువారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేష్‌కు లక్ష చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకులు చెంగయ్య, భాస్కర్‌రెడ్డి, పురం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



ఎంపీడీఓతో చర్చిస్తున్న రవికుమార్ నాయుడు

బి.కొత్తకోట: రాజకీయాలను పక్కన పెట్టి అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ వి.రవికుమార్ నాయుడు కోరారు. గురువారం ఆయన బి.కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ నిధులు, వాటి వినియోగం, పెన్షన్ల పంపిణీ విధానం, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీడీఓ మంగళం శంకరయ్యతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో మండల పరిషత్ సమావేశాలు జరగకపోతే అభివృద్ధి కుంటుపడుతుందని, మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అటంకాలు సృష్టించవచ్చని టీడీపీ నాయకులకు సూచించారు. నిధులు సద్వినియోగం చేసుకునేందుకు మండల పరిషత్ సమావేశాల నిర్వహించి తీర్మానాలు చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ములకలచెరువులో తక్కువగా, మిగిలిన మండలాల్లో నిధులు పుష్కలంగా ఉన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో వేసవి పరిస్థితులు నెలకొని నీటి సమస్యలు మొదలైనట్టు చెప్పారు. ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించడం కోసం కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి జెడ్పీ ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేశామని చెప్పారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



కొబ్బరిచెట్ల సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: కొబ్బరి చెట్ల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసులు సోమశేఖర్‌బాబు తెలిపారు. కొబ్బరి చెట్లలో సస్యరక్షణపై కేవీకేలో జరుగుతున్న ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక కేవీకే ఆవరణలోని కొబ్బరిచెట్లును కోకోనట్ క్లైంబర్‌తో ఎక్కడంపై రైతులకు ప్రయోగాత్మకంగా మాస్టర్ ట్రైనర్‌లు రఘు, శ్రీను వివరించారు. కొబ్బరి రకాలు, సాగు పద్ధతులు, నేల ఎంపిక, భూసార పరీక్షలు, ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితరాలపై ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, సేద్యపు విభాగ శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు వివరించారు.శాస్త్రవేత్తల సూచనలు పాటించి తెగుళ్లను నివారించుకోవాలని పేర్కొన్నారు. కేవీకే సమన్వయ కర్త డా మంజుల, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో మెరుగైన వసతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి

నిమ్మనపల్లె : ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో మెరుగైన వసతులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాచవేటివారిపల్లి పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారిపల్లిలోని గుడ్లవారిపల్లెలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చేసి, జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీరు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ మౌలిక సదుపాయాలను ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా, సామాజికంగా, విద్యలోనూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మండలంలో ఇప్పటికే రూ.1.5 కోట్ల నిధులతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని, మరో రూ. 62 లక్షలతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ నాయకులు మునిరత్నం, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రెడ్డి వెంకటేష్, డీటీ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : అన్నమయ్యజిల్లాలో కల్లుగీత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం 11 మద్యం దుకాణాలను కేటాయించిందని మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని, దుకాణాల ఏర్పాటుకు (ఆన్‌లైన్/ఆఫ్‌లైన్/ హైబ్రిడ్ మోడ్) జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తు రుసుము రూ.2లక్షలు (నాన్ రీఫండబుల్) అని, లైసెన్స్ ఫీజు జనరల్ ఫీజులో 50శాతం మాత్రమే ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అని, తదుపరి ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10 గంటలకు రాయచోటి అన్నమయ్యజిల్లా కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు ఉంటుందని చెప్పారు. గౌండ్ల కులం వారికి పీలేరు, బి.కొత్తకోట రూరల్, రాయచోటి మున్సిపాలిటీ గౌడ్ కులానికి, నందలూరు గౌడ కులానికి, మదనపల్లె మున్సిపాలిటీ, రాజంపేట మున్సిపాలిటీ, తంబళ్లపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కలకడ, వీరబల్లి ఈడిగ కులానికి కేటాయించామన్నారు. వివరాలకు అన్నమయ్య జిల్లా ఈఎస్, ఏఈఎస్, మదనపల్లె ఎస్‌హెచ్‌ఓలను 7981216391, 9441244800, 9440902533 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మద్యం షాపుకు దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లిలో మద్యం షాపు కోసం కల్లుగీత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి సూచించారు. ఈ తసందర్భంగా గురువారం ఆమె సిబ్బందితో కలసి స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో దరఖాస్తులకు సంబంధించి ప్రతిని అంటించారు. సీఐ మాట్లాడుతూ దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు చెల్లించాలన్నారు. లైసెన్స్ ఫీజు జనరల్ ఫీజులో 50 శాతం మాత్రమే ఉంటుందన్నారు. ఆశక్తి గల వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం రాయచోటి కలెక్టరేట్‌లో 7న డ్రా తీస్తారని సీఐ సూచించారు.

కుష్టురహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరురూరల్ : అందరి కృషితో కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దామని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేళ్లచెరువులో సర్పంచ్ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో కుష్టువ్యాధి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చీపాటివారిపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చునని నిర్ధారణ కోసం సమీపంలోని పీహెచ్‌సీలో సంప్రదించాలని కోరారు. కుష్టువ్యాధి నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండయ్యనాయుడు, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, రత్నం, సీహెచ్‌వో కుముదా తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ: తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు, తిరుపతిలో జరిగే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఉర్దూ కవులు బాబా ఫక్రుద్దీన్, పఠాన్ మహమ్మద్‌ఖాన్ కోరారు. జాతీయ స్థాయిలో జరిగే ఉర్దూ కవి సమ్మేళనాలనకు మదనపల్లెకు చెందిన ఫక్రుద్దీన్ అలియాస్ ఖమర్ అమీని, పఠాన్ మహమ్మద్‌ఖాన్‌ను ఆహ్వానించారు. ఉర్దూ భాషలో నిర్వహించే కవి సమ్మేళనాలు మత సామరస్యం, జాతీయ సమైక్యతకు దోహదపడుతాయని వారు తెలిపారు.

గాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శం



బి.కొత్తకోట: గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

బి.కొత్తకోట: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గం దేశ ప్రజలందరికీ ఆదర్శం కావాలని ఎంఈఓ ఆర్.రెడ్డిశేఖర్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మార్సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంతో గాంధీ పాత్ర కీలకమని కొనియాడారు. విద్యార్థులు గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన సిద్ధాంతాలను ఆచరించాలని కోరారు. భవిత, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్, వాసవికపుల్స్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ శాంతి మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించారని పేర్కొన్నారు. గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాల్లో ప్రజలు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలసా వేణుగోపాల్, బాల, అరవింద్‌బాబు, రాజేంద్ర, యర్రయ్యశెట్టి, తులసీకృష్ణ, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో..

అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక దేవతానగర్‌లోని చైతన్య అనాథాశ్రమ పాఠశాలలో గురువారం విజయ భారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ సేతు మనవరాలు నీహీరా జన్మదినం పురస్కరించుకుని విద్యార్థులను అన్నదానం చేశారు. మొదట పాఠశాలలో మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. విజయ భారతి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నిశ్చల, ఆశ్రమ నిర్వాహకులు ఆనందన్, కవితారాణి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కలికిరి: బీసీ కార్పొరేషన్ నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలకు రుణాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తిరావు తెలిపారు. బీసీ కార్పొరేషన్ నుంచి కలికిరిలో బ్యాంక్ ఆఫ్ బరోడా–3, సప్తగిరి గ్రామీణ బ్యాంక్–5, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–3, మొత్తం 11 రుణాలు, ఈబీసీ ద్వారా 5 రుణాలు, వీటిలో బీఓబీలో (ఈబీసీ–1, రెడ్డి–1), ఎస్‌జీబీలో (కమ్మ–1, రెడ్డి–1, ఆర్యవైశ్య–1), ఓబీఎంఎంఎస్ ద్వారా 30 రుణాలు ఉండగా వీటిలో బీఓబీ–8, ఎస్‌జీబీ–16, ఎస్‌బీఐ–6, ఎస్‌జీబీలో జనరిక్ మందుల షాపు–1 మంజూరయ్యాయన్నారు. 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపు కలిగి, రేషన్ కార్డు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు వివరాలు అందజేయాలని ఎంపీడీఓ కోరారు. ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తంబళ్లపల్లె: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఫిబ్రవరి 7వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి 51 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. బీసీ– 1 కేటగిరికి 9, బీసీ–బీకి 9, బీసీ–డీ 10, బీసీ–ఈ 7, ఈబీసీ 2, కాపు–10, కమ్మ–1, రెడ్డి–2, ఆర్యవైశ్య–1 మంజూరైనట్లు తెలిపారు.